

శ్రీశైలం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): శ్రీగిరిలో ఉగాది మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం క్షేత్ర రథవీధుల్లో అశేష భక్తజనం మధ్య స్వామి, అమ్మవార్లకు ప్రభోత్సవం నిర్వహించారు. పుష్పప్రియుడైన మల్లన్నకు సుగంధ పుష్పాలు, పరిమళ ద్రవ్యాలతో అలంకరించిన ప్రభపై ఆదిదేవులను ఊరేగించారు. ఈ వేడుక అనంతరం రాత్రి భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు నందివాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వగా, మహాసరస్వతి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అనంతరం క్షేత్రపురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరావు, అర్చకులు, అధికారులు, సిబ్బంది, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు



కన్నుల పండువగా ఆది దంపతుల ప్రభోత్సవం

- నంది వాహనంపై విహరించిన స్వామి, అమ్మవార్లు
- మహా సరస్వతిగా దర్శనమిచ్చిన అమ్మవారు
- నేడు పంచాంగ శ్రవణం, రథోత్సవం



కోలాట నృత్యం



ఆకట్టుకుంటున్న గొరవయ్యల వేషధారణ





శంఖం పూరిస్తూ..

అలరించిన వీరాచార విన్యాసాలు, అగ్నిగుండ ప్రవేశం

శనివారం రాత్రి శివదీక్షాశిబిరాల వద్ద వీరాచార సంప్రదాయాన్ని అనుసరించి భక్తులచే వీరాచార విన్యాసాలు, అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాలు నిర్వహించారు. కర్ణాటకకు చెందిన వీరశైవ భక్తులు వీరభద్రవచనాలను పఠిస్తూ శూలాలు మొదలుగా గల అస్త్రాలను తమ చంపల్లోకి, నాలుకలలోకి, పెదవులలోకి, కడుపులోకి, చేతులకు గుచ్చుకుంటారు. ఈ విన్యాసాలు చేసేవారిని పురవంతులు అని పిలుస్తారు. తరువాత ఎంతో భక్తిప్రపత్తులతో నిప్పులపై నడుస్తారు. వీరు చేసే విన్యాసాలు చూపరులను ఎంతో ఆశ్చర్యానికి గురిచేశాయి.

నేడు పంచాంగ శ్రవణం, రథోత్సవం

నేడు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం 10గంటలకు పంచాంగ శ్రవణం, సాయంత్రం 5 గంటలకు రథోత్సవం, రాత్రి అమ్మవారు రమావాణి సేవిత రాజరాజేశ్వరిగా దర్శనమివ్వనున్నారు.



నంది వాహనంపై స్వామి, అమ్మవార్లు



గ్రామోత్సవం



మహా సరస్వతిగా అమ్మవారు



పాతాళగంగ వద్ద పుణ్య స్నానమాచరిస్తున్న భక్తులు

కొండంత పండుగ శ్రీవిశ్వావసు ఉగాది

- ముస్తాబైన ఆలయాలు ● పంచాంగ పఠనానికి ప్రత్యేక ఏర్పాట్లు ● నేడు ఉగాది పర్వదినం



నంద్యాలలో ముస్తాబైన సంజీవనగర్ రామాలయం



మామిడి, అరటి ఆకులు కొంటున్న ప్రజలు

నంద్యాల కల్చరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రుచుల పండుగ ఉగాది. జీవితంలో అన్ని అనుభవాలను, ఉద్వేగాలను, ఆనంద విషాదాలను సమంగా స్వీకరించాలని, కలిపి ఆస్వాదించాలని చాటే పండుగ తెలుగు సంవత్సరాది. ఉగాది పచ్చడిలోని అర్థం అదే. షడ్రుచులు కలిసే ఉగాది పచ్చడిని ఆస్వాదించడం సంప్రదాయం. తెలుగు పంచాంగం ప్రకారం ఆదివారం శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ఆరంభం కాబోతుంది. ఈ సందర్భంగా ఆలయాల్లో పంచాంగ పఠనానికి ఏర్పాట్లు చేశారు. నంద్యాల మార్కెట్‌లో ప్రజలు ఉగాది పచ్చడికి కావల్సిన వేప పువ్వు, బెల్లం, చెరకుగడలు, మామిడి కాయలు, ఇళ్ల ముంగిట మామిడితోరణాలు,పూజల కోసం పువ్వులు, అరటిఆకులు,రంగులు చల్లుకోవడానికి రంగులు కొనుగోలుచేయడంలో నిమగ్నమయ్యారు. నూతన వస్త్రాలు కొనుగోలు చేశారు.

వచ్చే నెల 30 దాకా ఈకేవైసీకి అవకాశం

రేషన్ లబ్ధిదారులకు ఊరట

నంద్యాల నూనెపల్లె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేసుకోవడానికి పౌరసరఫరాల శాఖ ఏప్రిల్ 30వరకు గడువు పొడిగించింది. తొలుత ఈ నెల 31వరకు సమయం ఉందని అధికారులు వెల్లడించినప్పటికీ జిల్లాలో 1.60 లక్షల మంది మిగిలిపోయారు. చాలామందిలో సందేహాలుండటం, ప్రస్తుతం పరీక్షల కారణంగా పిల్లలు అందుబాటులో లేకపోవడంతో ఇది అనివార్యమైంది. జిల్లాలో 15,17,936 రేషన్‌కార్డుదారులుండగా వీరిలో 13,57,936 మంది ఈకేవైసీ చేయించుకున్నారు. మిగిలిన 1.60లక్షలమంది చేయించుకోవాల్సి ఉంది. ప్రభుత్వం గడువు పెంచడంతో ఊరట కలిగింది.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



నంద్యాలలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి రాష్ట్ర న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన వెంట పార్టీ నాయకులు రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు, మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు తదితరులు ఉన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి అర్పించిన మంత్రులు

బనగానపల్లె: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తామని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లె పట్టణంలో టీడీపీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి బీసీ విలేకరులతో మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం టీడీపీ కృషి చేస్తోందన్నారు. ఉప సర్పంచ్ బురానుద్దీన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాయలసీమ సలాం, పులి ప్రకాశ్‌రెడ్డి, బాబయ్య, కృష్ణానాయక్, ఇస్మాయిల్‌ఖాన్, అల్తాఫ్ హుసేన్, ఖాదర్, ఇమ్ము, నియాజ్, సబ్బీర్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.



బనగానపల్లెలో టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి బీసీ

'పది' పరీక్షకు 99 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఒకేషనల్ విద్యార్థులకు నిర్వహించిన పరీక్షకు 99 మంది గైర్హాజరయ్యారు. డీఈవో జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 43 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 4754 మంది విద్యార్థులకు గాను, 4655 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావడం జరిగిందని, 99 మంది గైర్హాజరైనట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు ఆరు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగలేదన్నారు.

జిల్లాలో భానుడి భగభగ

రుద్రవరం మండలంలో అత్యధికంగా 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత



నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. శనివారం 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో అత్యధికంగా రుద్రవరం మండలంలో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే నంద్యాలలో 42.9 డిగ్రీలు, సంజామల, గోస్పాడు, దొర్నిపాడు మండలాల్లో 42.5 డిగ్రీలు, నందికొట్కూరు 42.2, ఆళ్లగడ్డ 42.1, కొత్తపల్లె 42.0 డిగ్రీలు, ఉయ్యాలవాడ 41.6, డోన్ 41.6, కొలిమిగుండ్ల 41.3, మహానంది, బనగానపల్లె 41.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగిలిన మండలాల్లో కూడా 39.0 నుంచి 40.0 డిగ్రీల వరకు నమోదయ్యాయి. 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైన మండలాల్లో వడగాలులు వీచాయి. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

తుంగభద్ర

సాహిత్యం






'నా...గుండె సవ్వడి!' కవితా ధ్వని

కర్నూలు కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): 'విలుకాడి గురి లక్ష్యం వైపు...విజేత గురి గమ్యం వైపు...విజయం సాధిస్తే నింగిలో మెరుపు...' అంటూ యువతను చైతన్యవంతులుగా తీర్చిదిద్దే కవిత్వం 'నా...గుండె సవ్వడి!' కవితా సంకలనం రచయిత కొప్పుల ప్రసాద్. వృత్తిరీత్యా ఆయన కళాశాల ఉపన్యాసకులు. కవిగా, భావకుడిగా, పదేళ్ల ఆయన కవితా ప్రపంచం చాలా విశాలమైనది. 'నా...గుండెల సవ్వడి!'లోని కవితన్నీ మరో శ్రీశ్రీని గుర్తుకు తెప్పిస్తాయి. కవిని శ్రీశ్రీ ఆవహించి రాయించాడేమో అన్న స్ఫూర్తితో కవితలన్నీ వేటికవే నిలుస్తాయి. విప్లవ, అభ్యుదయ, చైతన్య గీతకలుగా ఈ కవితలు నిలిచిపోతాయి. 'ఆవేశం ఆయుధంగా మార్చుకో... నీ భవితకు దిక్సూచిలా చేర్చుకో...నీపై వచ్చే నిందలన్నీ తాత్కాలికమే...గెలిచి చూపించు నీ ఆధిపత్యాం...తనువు రక్తమాంసం నీకొక సైన్యం...నింగిని శాసిస్తావు...సముద్రాన్ని ఈదేస్తావు...కొండను తొలిచి కోటలనే నిర్మిస్తావు...అంటూ ఓ యువతా తెలుసుకో గెలుపు సత్యం అన్న కవితా శీర్షికలో యువతలో సచేతన భావాలను నింపుతాడు. వారికి ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాడు. నా సంతకం అనే శీర్షికతో ఉన్న మరో కవితలో చీకటి రాత్రి విశాలమైన నింగిలో...అమావాస్య రోజు చుక్కల మెరుపుల్లా....ముత్యాల తలంబ్రాల ఆకారంలో...దిక్కుల అంచున నుంచీ సాగాలి నా సంతకం..అంటారు. ప్రపంచ శాంతి కపోతమై ఎగరాలి అనే మరో శీర్షికతో రాసిన కవితలో 'కొత్త స్వర్ణలోకం కోసం తపిస్తూ...యుద్ధాలు లేని స్థలాలను గుర్తిస్తూ...దుఃఖపు కన్నీళ్లను తుడిచేందుకు సహనంతో శాంతి పర్వం నెలకొల్పాలి...' అంటారు. అలాగే ఏళ్ల చరిత్రలో రక్తపు మరకలు...తొలగించేందుకు ఎన్ని జెండాలు దేశాల నెత్తిపై ఎగురుతున్నా...మానవత్వపు సువాసనలు వ్యాపించడం లేదు...బంగారపు పంటలో కలుపు మొక్కలు చూస్తున్నాం...ఏదేమైనా నిరంతరం రగులుతూనే ఉంది మనను...ఆవేశపు వేడిని కన్నీళ్ల చల్ల పరచడం లేదు' అంటారు. ఇలా అనేక కవితా విస్ఫోటనాల కూర్పే 'నా...గుండె సవ్వడి!' అలాగే తన గురించి 'అలసిన వేళ అక్షరాలు నెమరేస్తూ...నా మనసు తెల్లని కాగితం...అందులో రాసుకున్న జ్ఞాపకాల చిట్టా...అందులో ఆనందం వెతుక్కుంటాను. నా ఊహలకు రెక్కలు తొడిగి, గాలి కదలికల్లో ఆకారం చూస్తూ...కనపడని వస్తువుకు అక్షరం జోడించి...నలుగురి కళ్లముందు కవితాక్షరాలు జాలువారుస్తాను. ఈ కవితా సంకలనంలోని కవితలన్నీ యువతలో స్ఫూర్తిని, భావ కవుల్లో ప్రేరణనీ, పెద్దవాళ్లకు వేదాంత సారాన్ని అందించేలా నిలుస్తాయి. అన్ని ప్రముఖ పుస్తక విక్రయశాలల్లో ఈ పుస్తకం లభిస్తుంది.



- నాగకుమార్ పేలాల
విశ్రాంత ప్రిన్సిపాల్,
సాహిత్య పరిశోధకుడు,
కర్నూలు.

ఉగాది సంబరాలు



తెలుగు వెలుగులకు ఆది ఉగాది
యుగ యుగాల సంస్కృతి పరంపరను
చాటి చెబుతున్న కొత్త సంవత్సరాది..

కూహూ అంటూ కోయిల గీతం...
నవ ఉషోదయానికి స్వాగతం
కొత్త సంవత్సరపు తొలి కిరణం
ఏడాదంతా మనకు కావాలి ఆనంద తరంగం

ఇంటి గుమ్మాలకు కట్టిన మామిడి తోరణం
వాటిపై అలంకరించిన బంతిపూల హారం
ఉగాది లక్ష్మికి హృదయ పూర్వక స్వాగతం
ఇంటిల్ల పాదికీ కలిగించెనే ఆనంద నందనం

తీపి, చేదు, కారం, ఉప్పు, వగరు, పులుపుల
షడ్రుచుల సమ్మేళనం...
ఉగాది పచ్చడి చెప్పెను జీవితంలో కష్టసుఖాల సారాంశం
ఇదే యుగాలుగా ఉగాది తీసుకువచ్చే సందేశం

పట్టు చీరెతో అమ్మ
పంచెకట్టుతో నాన్న
భుజంపై కొత్త కండువా వేసుకున్న తాతయ్య
బోసినవ్వులతో మురిసే నానమ్మ...
పరికిణీలో అక్కయ్యల ఆటపాటలు...
కొత్త దుస్తులతో తమ్ముళ్ల క్రీడా సంబరాలు

కొత్త సంవత్సరం అందరికీ ఇవ్వాలి నూతన యశస్సులు
అందరి అంతరంగాల్లో విరబూయాలి సంతోషాలు
ప్రపంచమంతా పరిఢవిల్లాలి శాంతి సౌభ్రాతృత్వాలు
ఇవి ధనశ్రీ హృదయపు కొత్త ఉగాది పలుకులు...!



- ధనశ్రీ, 8వ తరగతి, మాంటిస్సోరి ఎ.క్యాంపు పాఠశాల, కర్నూలు.



కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

సాహితీవేత్తలకు ఉగాది పురస్కారాలు

నేడు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పురస్కారాల అందజేత

కర్నూలు కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా సాహితీరంగంలో ఇద్దరికి రాష్ట్రస్థాయి ఉగాది విశిష్ట పురస్కారాలు వరించాయి. కర్నూలుకు చెందిన చారిత్రక పరిశోధక నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్, బాలల సాహితీవేత్త, కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్ ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. రాష్ట్ర దేవదాయ శాఖ, పర్యాటక శాఖ, భాషా సాంస్కృతిక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో, విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఉదయం 9 గంటలకు జరిగే విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కుమార్ చేతుల మీదుగా వీటిని అందజేయనున్నారు.

చారిత్రక పరిశోధన రచయిత ఎస్‌డీవీ అజీజ్...



కర్నూలుకు చెందిన ప్రముఖ చారిత్రక నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ 1964 ఆగస్టు 11న జన్మించారు. 1980 నుంచీ సుమారు 45 ఏళ్లుగా సాహిత్య రచన చేస్తున్నారు. జిల్లాకు చెందిన చారిత్రక అంశాలను ఆయన పరిశోధన చేసి రాసిన నవలలు ప్రశంసలు అందుకున్నాయి. అలా ఆయన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, కర్నూలు నవాబు గులాం రసూల్ ఖాన్ బ్రిటీషు వారిపై పోరాటం, హైదరాబాదు నవాబుపై తిరుగుబాటు చేసిన తుర్రేబాజ్‌ఖాన్, మహాదాత బుడ్డా వెంగళరెడ్డి, కృష్ణదేవరాయల పాలనలో జిల్లా పరిస్థితి, జిల్లాలో మహాత్మా గాంధీ పర్యటనలు వంటి అంశాలతో కూడిన నవలలు విమర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. అజీజ్ రాసిన అనేక రేడియో చారిత్రక నాటకాలు కూడా జాతీయ స్థాయిలో బహుమతులు అందుకున్నాయి. భారతదేశంలో స్త్రీ (ఆదిమ కాలం నుంచీ ఆధునిక కాలం వరకు), శ్రీకృష్ణదేవరాయలు, వంటి పరిశోధన గ్రంథాలను వెలువరించారు. మనస్విని, వజన, శిధిల శిల్పాలు, హరిణి, వైశాలి నవలలు రాశారు. ఆరుకు పైగా కథా సంపుటాలు వెలువరించారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచీ 2007లో కందుకూరి పురస్కారం, 2017లో తెలుగు యూనివర్శిటీ కీర్తి పురస్కారం, 2018లో హీరాలాల్ స్మారక పురస్కారం, 2019లో టీజీవీ కళాక్షేత్రం పురస్కారాలతోపాటూ వరుసగా 2023 వరకు వివిధ సాహితీ సంస్థల పురస్కారాలు అందుకున్నారు.


బాలల సాహిత్యంలో చేయి తిరిగిన రచయిత డాక్టర్ ఎం. హరికిషన్...



బాల సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక శైలితో రాణిస్తున్నారు కర్నూలుకు చెందిన ప్రముఖ బాలల సాహితీవేత్త, కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్. వృత్తిరీత్యా ఉపాధ్యాయునిగా భావి బాలల భవిష్యత్తుకు పునాదులు వేస్తున్న ఆయన సాహిత్యపరంగా సామాజిక సమస్యల్ని పరిష్కరించడం కోసం, సమాజంలో చైతన్యాన్ని పెంపొందించడం కోసం సాహిత్యాన్ని సాధనగా చేసుకున్నారు. సాహిత్య ప్రయోజనం ఆనందం కలిగించడమే కాదు, సామాజిక స్పృహ పెంపొందించడం అని నమ్మే ఆయన నేడు సోషల్ మీడియాలోనూ తనదైన రీతిలో కథా రచన సాగిస్తున్నాడు. 1972లో నాటి కర్నూలు జిల్లా పాణ్యంలో కృష్ణవేణమ్మ, హుసేనయ్య దంపతులకు జన్మించిన ఆయన కర్నూలులో డిగ్రీ విద్యాభ్యాసం పూర్తిచేసి, నాటి కర్నూలు పీజీ సెంటర్‌లో 'ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి కథలు - సామాజిక దర్శనం' అనే అంశంపై డాక్టరేట్ పట్టా పొందారు. ప్రస్తుతం కోడుమూరు మండలం, అమడగుంట్లలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న హరికిషన్ పీజీలో అధ్యాపకుడు, కథా రచయిత అయిన డాక్టర్ తుమ్మల రామకృష్ణ సాహచర్యంతో సాహిత్యంపట్ల ఆసక్తి పెంచుకున్నారు. 1997లో తొలికథ 'పడగనీడ' ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితం అయింది. దాంతో మరింత ఉత్సాహంతో కథలకు శ్రీకారం చుట్టారు. 13 కథలతో బాలసాహిత్యంలో 'మాయమ్మ రాచ్చసి', 22 కథలతో సామాజిక అంశాలతో 'కందనవోలు కథలు' రాశారు. బాలల కోసం ఆయన 30కి పైగా కథా సంపుటాలు వెలువరించారు. కర్నూలు బుక్‌ట్రస్టు పేరుతో ఒక ప్రచురణ సంస్థను నెలకొల్పి అనేక పుస్తకాలు ప్రచురిస్తున్నారు.

నంద్యాల కళాకారుడికి కళారత్న పురస్కారం

పలు నాటకాలు, సినిమాలు, సీరియల్స్‌లో నటించిన ఎస్ఆర్ఎస్ ప్రసాద్




నంద్యాల కల్చరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉగాది పండుగ సందర్భంగా సాహిత్య, కళా రంగాలలో ప్రతిభగల కళాకారులను, సాహితీవేత్తల కృషిని గుర్తించి కళారత్న హంస ఉగాది పురస్కారం ప్రదానం చేస్తోంది. ఈ సంవత్సరం నంద్యాలకు చెందిన కళాకారుడు ఎస్ఆర్ఎస్ ప్రసాద్‌ను ఎంపిక చేశారు. ఆయనకు అత్యంత ప్రతిష్ఠాత్మక కళారత్న హంసను ప్రదానం చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం 50వేల రూపాయల నగదు, హంస పురస్కార పత్రం, ప్రముఖుల చేతుల మీదుగా శాలువా కప్పి సర్టిఫికెట్ ప్రదానం విజయవాడలో ఆదివారం జరిగే సభలో ప్రదానం చేస్తారు. ఎస్ఆర్ఎస్ ప్రసాద్ 40 సంవత్సరాలుగా నాటక రంగంలో కొనసాగుతూ నాటక రంగ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తూ రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల్లోనే కాకుండా విదేశాల్లో సైతం నాటక ప్రదర్శనలు ఇచ్చి ఎంతో గుర్తింపు తెచ్చుకొని ఎన్నో అవార్డులు రివార్డులు లెక్కకుమించి సన్మానాలు పొందారు. గతంలో నంది అవార్డుతో పాటు, 50కి పైగా నాటికలు, 300కి పైగా నాటక రంగంలో బహుమతులు పొంది, 40సంవత్సరాలుగా విశేషంగా నాటక రంగ అభివృద్ధికి కృషి చేశారు. ఈ సందర్భంగా న్యాయశాఖమంత్రి ఎన్ఎండి ఫరూర్, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, మాజీమంత్రి భూమా అఖిల ప్రియ, నంద్యాల కళారాధన అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మధుసూదన్‌రావు, టీడీపీ నాయకులు రామచంద్రారావు, ఏవీఆర్ ప్రసాద్ తదితరులు హర్షం ప్రకటించారు.

నాటక రంగ సేవల్లో పత్తి ఓబులయ్య



కర్నూలు కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్యకు రాష్ట్ర స్థాయి ఉగాది కళారత్న (హంస అవార్డు) పురస్కారం లభించింది. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం జే.పుల్లలచెరువు గ్రామంలో 1952 జనవరి 1న రైతు కుటుంబంలో జన్మించిన పత్తి ఓబులయ్య తిరుపతిలో ఎంఏ విద్వాన్ (తెలుగు) పూర్తి చేశారు. అనంతరం కర్నూలు చేరుకుని 1980 నుంచి 2005 వరకు తెలుగు అధ్యాపకునిగా పని చేశారు. 2005 నుంచి 2010 వరకు సెయింట్ మేరీస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవి విరమణ చేశారు. ఆయన తొలుత సాంఘిక నాటకాలపై దృష్టి పెట్టారు. 2002 నుంచి ఇప్పటి వరకు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడుగా కొనసాగుతున్నారు. 1999 నుంచి 2020 వరకు జిల్లా సాంస్కృతిక మండలి సభ్యునిగా కొనసాగారు. ఆయన దర్శకత్వం వహించిన పులిస్వారి నాటకం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 150 పైగా ప్రదర్శనలు చేశారు. ఈ నాటకం ఆనాటి శాసనసభ కమిటి అభినందనలు కూడా అందుకుంది. అలాగే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితకథపై సైసైరా అను నాటకాన్ని ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉగాది వేడుకల రోజున కళారత్న బిరుదుతో సత్కరించనుంది.

బెట్టింగ్ ఊబిలో క్రికెట్ ప్రియులు



- ఐపీఎల్ ఆట.. కొందరికి కాసుల పంట
- ఆన్‌లైన్ యాప్‌లతో నష్టపోతున్నవైనం
- జిల్లాలో ఎంతో మంది బాధితులు

ఆదోని, మార్చి 29(ఆంధ్రజ్యోతి) : ఆదోని పట్టణంలోని గణేష్ సర్కిల్‌కి చెందిన ఒక యువకుడు బెట్టింగ్‌లకు అలవాటు పడి డబ్బులు పోగొట్టుకున్నాడు. స్నేహితుల నుంచి, ఆన్‌లైన్ యాప్‌ల్లో రూ. లక్షల్లో అప్పులు తీసుకొని మరీ బెట్టింగ్‌ల్లో పెట్టాడు. చివరకు అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు.


ఆదోని మండలానికి చెందిన ఓ విద్యార్థి తిరుపతిలోని ఓ యూనివర్శిటీలో బీటెక్ సెకండియర్ చదువుతున్నారు. ఆన్‌లైన్ బెట్టింగులు, క్రికెట్ గేమ్స్, పందేలకు బానిసై అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చేందుకు యాప్‌ల ద్వారా లోన్‌లు తీసుకుని మరింత నష్టాల ఊబిలో కూరుకుపోయాడు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలిసిపోవడంతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆదోని మండలం, కర్ణాటక సరిహద్దు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల పట్టణంలో స్థానిక లాడ్జిలో మహిళతో ఉండి ఆన్‌లైన్ జూదం ఆడుతుండగా ఓ కానిస్టేబుల్ తమ పోలీస్ స్టేషన్ పరిధి కాకపోయినా సమాచారం తెలుసుకొని నేరుగా పట్టుకున్నట్లు సమాచారం. వారి దగ్గర పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేయగా చివరికి రూ. 3 లక్షలు సెటిల్మెంట్ చేసుకొని వెళ్లిపోయినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇట్లా తెలిసినవి కొన్నే ఇలాంటి సంఘటనలు ఆదోనిలో అనేకం.

● క్రికెట్ క్రీడాభిమానులను ఉర్రూతలూగించే ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియం లీగ్) ప్రారంభమైంది. రెండు నెలలకు పైగా సాగే ఈ సంగ్రామాన్ని కొందరు వినోదం కోసం చూస్తుంటారు. మరికొందరు సలభంగా ఆదాయం సంపాదించే వనరుగా భావిస్తున్నారు. బంతి బంతికీ బెట్టింగ్ పెట్టి డబ్బు సంపాదించాలని అత్యాశ పడుతున్నారు.

● వినోదం కోసం చూసి అప్పుల ఊబిలో చిక్కుకొని చేసిన అప్పులు తీర్చలేక చివరకు ఆత్మహత్యకు పాల్పడుతున్న ఘటనలు గతంలో ఎన్నో చోటుచేసుకున్నాయి.

ప్రధానంగా యువతే ఇందులో బాధితులుగా మారుతున్నారు. గతంతో ఐపీఎల్ క్రికెట్ క్రీడలకు సంబంధించి పట్టణాల్లోనే సాగే బెట్టింగ్‌లు... నేడు సెల్ ఫోన్ పుణ్యమా అని పల్లెలకూ పాకింది. కొన్నేళ్ల కిందట అందరూ ఓ చోట కూర్చుని పందేలు కాసేవారు. తర్వాత కాలంలో పెద్ద మొత్తంల్లో బెట్టింగ్‌లు జరిగేటప్పుడు బుకీల పేర్లు వినిపించేవి. ప్రస్తుతం చాలా వరకు ఆన్‌లైన్‌లో ఐపీఎల్ మ్యాచ్‌ల బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. యువత పలు యాప్‌లో పందేలు కాస్తూ అప్పుల వలయంలో చిక్కుకుంటున్నారు. అప్పులు తీర్చేందుకు ఆస్తులు అమ్మి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.. అధిక మొత్తానికి ఆశపడి జిల్లాలో కొంతమంది యువకులు బెట్టింగ్ యాప్‌ల మాయలో పడి కుటుంబ సభ్యులకు తెలియకుండా అప్పు చేసి పెట్టుబడి పెడుతున్నారు. తక్కువ పెట్టుబడికి అధిక మొత్తం వస్తుందని ఆశపడి ఆన్‌లైన్‌లోని యాప్‌ల ద్వారా బెట్టింగ్‌లు కాస్తున్నారు. ప్రారంభంలో రూపాయికి రూపాయి లాభం రావడంతో క్రమేణా అధికమొత్తంలో పెట్టుబడి పెడుతున్నారు. ఆన్‌లైన్‌లోనే నగదు బదిలీ చేస్తున్నారు. కొంతకాలం తర్వాత నష్టాలు ఎదుర్కొని ..తాము మోసపోయామని గ్రహించి లబోదిబోమంటున్నారు. పెట్టుబడి సొమ్ము పోవడమే కాకుండా బకాయి ఉన్నట్లు యాప్‌ల బుకీల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్ తట్టుకోలేక సతమతమవుతున్నారు. ఈ క్రమంలో పరువు పోయిందనే ఉద్దేశంతో కొంతమంది ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. యువత ఈజీ మనీకి అలవాటుపడటంతోనే ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. పరువు పోతుందనే ఉద్దేశంతో ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకంజవేస్తున్నారు.



పందేల జోలికెళ్లొద్దు



ఐపీఎల్ పోటీలు వినోదాత్మకంగా సాగాలి తప్ప పందేలు జోలికి పోకూడదు. బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలి. ఒక్కసారి ఆ ఊబిలో దిగితే చాలు...పైకి రావటం కష్టం. ఇలాంటి యాప్‌లు, పందేలు కాస్తే కఠిన చర్యలు తప్పవు.

- హేమలత, డీఎస్పీ, ఆదోని

కోడ్ భాషను ఉపయోగిస్తూ...

బెట్టింగ్‌కు పాల్పడే వారు ఇతరులకు అర్థం కాకుండా కోడ్ భాష ఉపయోగిస్తున్నారు. కోడ్‌ల ప్రకారం బెట్టింగ్‌లు పెడుతున్నారు. వారు గెలిస్తే డబ్బు ఎలా ఇవ్వాలో ముందే మాట్లాడుకుంటారు. ఎక్కువగా ఆన్‌లైన్, సెల్‌ఫోన్‌ల ద్వారా తమ పని కానిచ్చేస్తున్నారు. ఎవరితో బెట్టింగ్ చేయదల్చుకున్నారో వారితో ఆన్‌లైన్, సెల్‌ఫోన్ ద్వారా బెట్టింగ్ చేస్తున్నారు.

టాస్ వేసిన దగ్గరి నుంచి

గతంలో క్రికెట్ బెట్టింగ్ గెలుపోటములపై ఎక్కువగా నడిచేది. కానీ ఇప్పుడు ఆటలో టాస్ నుంచి మొదలుకొని బంతి బంతికీ ఒక రేటు ఉంటుంది. ఈ బంతి బౌండరీ దాటుతుందని, సిక్స్ కొడుతాడని, ఫలానా ఆటగాడు ఇంత స్కోర్ చేస్తాడని, బౌలర్ వికెట్ తీస్తాడని ఇలా రకరకాలుగా పందేలు కాస్తుంటారు. చెప్పినట్లు జరిగితే అతను వేసిన సందెంపై మూడు రెట్లు అదనంగా వస్తుంది. ఏజెంట్ల ద్వారా జరిగే బెట్టింగ్‌లు కూడా ఇంచుమించు ఇలాగే ఉంటాయి. ఇందులో బెట్టింగ్ కాసిన వ్యక్తి గెలిస్తే అతనికి రెండు రెట్లు అదనంగా చెల్లిస్తారు.

బెట్టింగ్ ఎలా నిర్వహిస్తారంటే

ఈ ఐపీఎల్ మ్యాచ్ జరిగే వాటిలో బెట్టింగ్ రకరకాలుగా జరుగుతున్నది. కొంతమంది గ్రూపులుగా ఏర్పడి బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. మరికొంత మంది మధ్యవర్తి సాయంతో బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. మ్యాచ్ అయిపోగానే వారి వారి బెట్టింగ్‌లలో ఎవరికి ఎవరు ఎంత ఇవ్వాలో చివరికి లెక్క చూసుకుంటున్నారు.

● **నిందితులపై కన్నేస్తే..:** బెట్టింగ్ కేసుల్లో అరెస్టు అయిన నిందితులపై పోలీసులు ఓ కన్నేస్తే కొంతవరకు ఈ బెట్టింగ్‌ను అడ్డుకోవచ్చు. మధ్యవర్తులుగా వ్యవహరించే బుకీల కార్యకలాపాలపైన కూడా దృష్టి సారించాలి. లోతుగా విచారిస్తే సూత్రధారులెవరో స్పష్టంగా తెలుస్తుంది. అవసరమైన పక్షంలో యాప్ నిర్వాహకులపైన కూడా కేసులు నమోదు చేయాలి.



స్వాధీనం చేసుకున్న నగదు (ఫైల్)

సిరి మల్లె

- కేజీ ధర రూ.750
- ఒక రోజులో 100 కేజీల దిగుబడి
- వారం రోజులకే రూ.2 లక్షల ఆదాయం
- లాభాలు గడిస్తున్న కౌలు రైతు ఫయాజ్



మల్లెపూలు

చాగలమర్రి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా మల్లెపూల ధర కొండెక్కింది. వారం రోజుల నుంచి సాధారణంగా ఉన్న ధర ఒక్కసారిగా కేజీ రూ.750 చేరింది. దీంతో రైతులకు మల్లెలు సిరులు కురిపిస్తున్నాయి. నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన కౌలు రైతు ఫయాజ్ మల్లెపూల సాగులో రికార్డు సాధించి ఆదర్శంగా నిలిచాడు. రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని మల్లెపూల తోట సాగు చేశాడు. రెండెకరాలకు రూ.లక్ష పెట్టుబడి పెట్టాడు. ఒకే రోజు 100 కేజిలకు పైగా మల్లెపూలు కోతకు వచ్చాయి. కేజీ రూ.750 పలకడంతో దాదాపు రూ.లక్ష ఆదాయం వచ్చింది. వారం రోజుల్లో రూ.3 లక్షల దాక వచ్చింది. కౌలు, కూలీలు పోను రూ.లక్ష ఆదాయం వచ్చింది. కష్టానికి తగ్గ ఫలితం వచ్చిందని కౌలు రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. దిగుబడి తక్కువగా ఉన్నా ధర ఉండటంతో మంచి ఆదాయం వచ్చిందని అన్నారు. వైరస్ వల్ల పంట దెబ్బతిని దిగుబడి తగ్గినా ధర ఆశించిన స్థాయిలో ఉండటంతో మంచి ఆదాయం వచ్చిందని అన్నారు.



మల్లెపూలతో కౌలు రైతు ఫయాజ్

మహానందిలో దుకాణాల వేలంలో రగడ



గొడవ పడుతున్న ఇరు పార్టీల మద్దతుదారులు

ఏడుగురిపై కేసు నమోదు

బహిరంగ వేలాల్లో ఘర్షణకు పాల్పడ్డ ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి శనివారం రాత్రి తెలిపారు. బహిరంగ వేలాల్లో అల్లర్లకు పాల్పడి వేలం పాటలో పాల్గొన్న భవనాశి రమణయ్యపై దాడి చేసిన మహానందికి చెందిన సుబ్బరామయ్యతో పాటు అతని సోదరులు ముగ్గురు. మరో ముగ్గురు వ్యక్తులపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

మహానంది, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఏడాది పాటు కొబ్బరి చిప్పలు పోగు చేసుకోవడం, మరుగుదొడ్ల నిర్వహణ వేలంలో రూ.27.50 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అలాగే ఆలయ పరిసరాల్లోని షాపులతో పాటు ఖాళీ స్థలాలకు మూడు సంవత్సరాల కాల పరిమితి కింద శనివారం బహిరంగ వేలాలను స్థానిక పోచా విశ్రాంతి భవనంలో నిర్వహించారు. ఉదయం నిర్వహించిన బహిరంగ వేలాల్లో భక్తుల కొబ్బరి చిప్పలు ఏడాది పాటు పోగు చేసుకొనే హక్కును మహానందికి చెందిన రాజ లింగేశ్వరయ్య రూ. 18, 9, 999 సీల్ టెండర్ ద్వారా దక్కించుకున్నారని ఈవో చెప్పారు. అలాగే బీఎస్ఎన్ ఎల్ కార్యాలయం పక్కన ఉన్న మరుగుదొడ్ల నిర్వహణను సి. మహేశ్వరయ్య రూ.9,40,000 దక్కించుకొన్నట్లు ఈవో తెలిపారు. అయితే ఆలయ పరిసరాల్లోని షాపులకు నిర్వహించిన బహిరంగ వేలాల్లో చాలా మంది వ్యాపారులు ధరావత్తు చెల్లించి పోటీలో పాల్గొనడంతో పోటీ పెరిగింది. దీంతో తీవ్ర ఉద్రిక్తత మధ్య షాపులకు వేలాలు జరిగాయి. ఏఈవో యర్రమల్ల మధు పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు సుబ్బారెడ్డి, మల్లికార్జునయ్య, నీలకంఠరాజు, నాగమల్లయ్య పాల్గొన్నారు.

టీడీపీ మద్దతుదారులపై వైసీపీ నాయకుల దాడి హేయమైన చర్య

సామరస్యంగా మహానందిలో జరుగుతున్న షాపుల బహిరంగ వేలాల్లో వైసీపీ నాయకులు బహిరంగ వేలాల్లో పాల్గొన్న టీడీపీ మద్దతుదారులపై దాడి చెయ్యడం హేయమైన చర్య అని కేసీ కెనాల్ అధ్యక్షుడు బన్నూరి రామలింగారెడ్డి అన్నారు. దీనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేసారు.

కారు బీభత్సం.. ఏడుగురికి గాయాలు



దుకాణంలోనికి దూసుకెళ్లిన కారు

కర్నూలు క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గాయత్రీ ఎస్టేట్ సమీపంలో టీడీపీ కార్యాలయం పక్కన కారు అదుపు తప్పి బీభత్సం సృష్టించింది. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి డా.ఉమామహేశ్వరరెడి తన కారులో శనివారం సాయంత్రం సి.క్యాంపు వైపు వెళ్తున్నారు. టీడీపీ కార్యాలయం వద్దకు చేరుకోగానే కారు అదుపు తప్పి ముందున్న ఓ ఆటోను, రెండు స్కూటీలను, ఓ బైక్‌ను ఢీకొట్టి పక్కనే ఉన్న భక్షాల సెంటరు దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కాశీవిశ్వనాథ్, లక్ష్మీనారాయణ, అబ్దుల్లాతో పాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. వీరందరినీ చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు అన్వేషిస్తున్నారు.

తొక్కిసలాటలో 140 గొర్రెల మృతి

పగిడ్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పగిడ్యాల మజార గ్రామమైన ఆంజనేయనగర్ సమీపంలో గొర్రెలు తొక్కిసలాటలో శనివారం 140కి పైగా గొర్రెలు మృతి చెందినట్లు బాధితులు మోహన్, సుధాకర్, బాలస్వామి తెలిపారు. వివరాలివీ.. తెలంగాణ రాష్ట్రంలోని వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం సగినేనిపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు సుమారు 900 గొర్రెలను మేత కోసం జనవరి నెలలో పగిడ్యాలకు వచ్చారు. పగిడ్యాల చుట్టు పక్కల గ్రామాలలోని పంట పొలాలలో జీవాలను మేపుకుంటు ఉండేవారు. రోజులాగే గొర్రెల మందను తీసుకొని ఆంజనేయనగర్ గ్రామ సమీపంలోని కేసీ కాలువ వెంట వెళ్లారు. సాయంత్రం కేసీ కాలువ నుంచి సమీపంలోని పొలాలలోకి మందను తీసుకొని సుజాత అనే కాపరి వెళ్తుండగా ప్రమాదవశాత్తు కింద పడటంతో గొర్రెలు భయంతో పరుగులు తీస్తూ తొక్కిసలాడటంతో సుమారు 140 గొర్రెలు మృతి చెందాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 20 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని చెప్పారు. పశుసంవర్ధకశాఖ ఏడీ రామంజులునాయక్, పగిడ్యాల పశువైద్యాధికారి శృతి కీర్తి చేరుకొని బాధితులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మృత్యువాతపడిన గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించారు.



మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న పశు వైద్యాధికారులు

గ్రీవెన్స్ అభ్యంతరాలపై వివరణ

కర్నూలు హస్పిటల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కి సంబంధించిన ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడానికి 29.01.2024 నోటిఫికేషన్‌కు సంబంధించి నాలుగు క్యాడర్ల గ్రీవెన్స్ అభ్యంతరాలపై వివరణను కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. మెడికల్ ఫిజిస్ట్, ఓటీ అసిస్టెంట్స్, అనస్థీషియా టెక్నీషియన్, జనరల్ డ్యూటీ అటెండర్ అభ్యర్థుల ఫిర్యాదులను పరిష్కారాలను పూర్తి చేసి Https://kurnool.ap.gov.in మరియు Https://kurnoolmedicalcollege.ac.inలో అప్‌లోడు చేసినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వెబ్‌సైట్‌లో చూసుకోవాలని తెలిపారు.

వచ్చే నెల 30లోపు ఈకేవైసీ చేసుకోవాలి

కర్నూలు కలెక్టరేట్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్‌కార్డులో ఉన్న సభ్యులు ఈకేవైసీ పూర్తి కానివారు ఏప్రిల్ 30లోపు ఈకేవైసీ చేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజా రఘువీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా జిల్లాలో 2,63,327 యూనిట్లు ఈకేవైసీ పూర్తి చేయలేదన్నారు. ఈకేవైసీ పూర్తి కానీ వ్యక్తి పేరు ఈపోస్ మిషన్‌లో రెడ్ మార్కులో ఉంటుందన్నారు. ఈ వ్యక్తి ఎండీయూ వద్ద కానీ, డీలర్ల వద్ద కానీ ఈకేవైసీ చేయించుకోవచ్చన్నారు.

మనస్తాపంతో వృద్ధురాలి ఆత్మహత్య

ఉయ్యాలవాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో వృద్ధురాలు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామంలో శనివారం ఉదయం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గజ్జల శివనాగమ్మ(82)కు సంతానం లేదు. వృద్ధాప్యంలో తనను ఎవరూ చూసేవారు లేరని ఆవేదనకు గురైయ్యింది. దాంతోనే ఇంట్లో ఉన్న రెండు స్తంభాలకు అడ్డంగా చీర కట్టి, మరో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఆమె తమ్ముడు చిట్టెపు వెంకటేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీశైలం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు సీఐ జి. ప్రసాదరావు తెలిపారు. వివరాలిలు.. శనివారం మధ్యాహ్నం శ్రీశైలంలోని వేర్వేరు ప్రదేశాల్లో కర్ణాటకకు చెందిన 24 మంది పేకాట ఆడుతుండగా డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించి పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. వీరి నుంచి రూ. 62,370 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశామని పట్టణ సీఐ హనుమంతనాయక్ తెలిపారు. ఓ చోట తొమ్మిది మంది నుంచి రూ. 72వేలు, మరోచోట పదిమంది నుంచి రూ. 38,930లు స్వాధీనం చేసుకొని, నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో సంజామల ఎస్‌ఐ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రేతలు..

కర్నూలు క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శరీన్‌నగర్‌లో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ మధుసూదన్‌గౌడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ గోపీనాథ్ తన సిబ్బందితో కలిసి దాడులు చేసి గంజాయిని విక్రయిస్తున్న నిందితులు నరసింహులు (చెంచునగర్), రంగనాయకులు (బళ్లారి చౌరస్తా), పవన్ (కల్లూరు), షేక్ ఇస్మాయిల్ (ముజఫర్‌నగర్), క్రిష్ణ (కృష్ణానగర్)లను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 2.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ సూచించారు. ఎవరైనా మత్తుపదార్థాలు అమ్మినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిరోజు తనిఖీలు చేస్తుంటామని తెలిపారు.

వంట ఏజెన్సీకి మెమో జారీ

మంత్రాలయం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో సూగూరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఏజెన్సీకి అధికారులు మెమో జారీ చేశారు. రుచికరంగా వడ్డించకపోతే ఏజెన్సీని రద్దు చేసి వేరే ఏజెన్సీని నియమిస్తామని ఎంఈవో రాగన్న, ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకట్రాముడు అన్నారు. 'ఈ అన్నం తినేదెలా?' అన్న శీర్షికతో శనివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన డీఈవో శామ్యూల్ పాల్ ఆదేశాల మేరకు ఎంఈవోలు మౌనుద్దీన్, రాగన్నలు శనివారం పాఠశాలను పరిశీలించి మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. అనంతరం చందన్ వంట ఏజెన్సీకి మెమో ఇచ్చారు. ఉపాధ్యాయులు రాజశేఖర్, శ్రీనివాసులు, కొండారెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు

కర్నూలు అర్బన్/ కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ పి. రంజిత్ బాషా తెలుగు నూతన సంవత్సరాది ఉగాది, రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది, అలాగే రంజాన్ శుభాకాంక్షలు జిల్లా ప్రజలకు తెలియజేశారు. ఖురాన్ అవతరించిన ఈ పవిత్ర మాసం ఉద్బోధించే ధార్మిక జీవితం సమాజాన్ని ప్రభావితం చేస్తుందని అన్నారు. ఈ పండుగల సందర్భంగా జిల్లా ప్రజలకు సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు.

నంద్యాల నూనెపల్లె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జీవితం సుఖ, దుఃఖాల మిశ్రమం అని చెప్పడమే ఉగాది పర్వదినం విశిష్టత అని కలెక్టర్ రాజకుమారి అన్నారు. జిల్లా ప్రజలందరికీ శ్రీ విశ్వావసునామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఉగాది పండుగకు ప్రత్యేకత ఉందని, షడ్రుచుల కలయికతో ఉగాది పచ్చడిని రూపొందిస్తారని, వైద్యపరంగా ఉగాది పచ్చడి వేసవి వ్యాధులనుంచి రక్షణను అందిస్తుందని ఆమె చెప్పారు. జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిసి సిరులపంటలు పండాలని ఆమె ఆకాంక్షించారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

మిర్చి పంటకు నీరు: సీఈ కబీర్ బాషా

నంద్యాల మున్సిపాలిటీ మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నూనెపల్లె సప్లై ఛానల్ పరిధిలో సాగవుతున్న మిర్చి పంటను కాపాడే ప్రయత్నంలో భాగంగా నీరిస్తున్నట్లు సీఈ కబీర్ బాషా తెలిపారు. సీఈ శనివారం నంద్యాల మండలంలోని పొన్నాపురం రెగ్యులేటర్‌నుతో పాటు కొంతమేర నూనెపల్లె సప్లై ఛానల్ పరిధిలో పర్యటించారు. సీఈ మాట్లాడుతూ ఛానల్ పరిధిలో 8 నుంచి 16 కిమీ వరకు మిర్చి పంట సాగు అవుతుందని, పంటలను రక్షించేందుకు నీరిస్తున్నట్లు తెలిపారు. సీఈ వెంట ఈఈ ప్రతాప్, డీఈఈ రవికుమార్ తదితరులు ఉన్నారు.

ఉగాది, రంజాన్ ముందస్తు వేడుకలు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎల్కేఆర్ గ్లోబల్ పాఠశాలలో ఉగాది, రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు పండుగల ప్రాముఖ్యత గురించి తెలియజేయడం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ నిర్మలాదేవి, కోఆర్డినేటర్ శ్రీకాంత్, ఏవో రమణ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ గడువు మరో మూడు నెలలు పెంచాలి

ఆత్మకూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల్లోని కుటుంబ సభ్యులందరికి ఈకేవైసీ నమోదు ప్రక్రియను మరో మూడు నెలలు పెంచాలని సీపీఎం నాయకులు నరసింహనాయక్, రణధీర్, సుధాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం తహసీల్దార్ రత్నరాధికకు వారు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రామ్ నాయక్, షేక్‌ఇస్మాయిల్, సురేంద్ర, వీరన్న తదితరులు ఉన్నారు.

ఉప్పర సంఘం అభివృద్ధికి సహకరించండి

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ఉప్పర సంఘం అభివృద్ధికి సహకరించాలని స్థానిక ఉప్పరం సంఘం నాయకులు శనివారం మంత్రి ఫరూక్‌కు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో సగరుల కళ్యాణ మంటపం నిర్మించడంతో పాటు భగీరథ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలంటూ మంత్రికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సురేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మహానంది నుంచి రాయచూర్‌కు బస్సు

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం సందర్భంగా మహానంది నుంచి కర్నాటకలోని రాయచూర్‌కు బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్ఎం రజియా సుల్తానా శనివారం తెలిపారు. రాయచూర్‌తో పాటు రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయానికి కూడా బస్ సర్వీస్ నడుపుతున్నట్లు చెప్పారు. కాగా శ్రీశైలానికి రీజన్ పరిధిలో 50 బస్సులు నడుపుతున్నామని చెప్పారు.

మాన్యంలోకి అనుమతి లేకుండా వెళ్లవద్దు

మహానంది, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయానికి చెందిన మాన్యం భూమిలోకి తమ అధికారి అనుమతి లేకుండా వెళ్లడం నేరమని ఏఈవో యర్రమల్ల మధు తెలిపారు. శనివారం ఆలయానికి చెందిన మాన్యం భూమిలో కొంతమంది వ్యక్తులు బొలేరో వాహనంలో సిమెంట్, కంకర తీసుకొని వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఏఈఓతో పాటు పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, నాగమల్లయ్య, టీడీపీ సమన్వయకర్త బన్నూరి రామలింగారెడ్డి మాన్యం భూమి వద్దకు చేరుకొని అడ్డుకున్నారు. ఆలయాలకు చెందిన ఆస్తులను కబ్జా చేయాలని చూస్తే చర్యలు తీసుకుంటామని ఏఈఓ అన్నారు.


ఆత్మకూరులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా


నందికొట్కూరులోని పటేల్ సెంటర్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య


జూపాడుబంగ్లాలో..


పాణ్యం టీడీపీ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న నాయకులు

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

జిల్లాలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శ్రీశైలం, నందికొట్కూరు ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, జయసూర్య తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచ నలుదిశలా చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రజల వద్దకే పాలన అందిస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ జెండా మోసిన క్రియాశీల నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. టీడీపీ ఆవిర్భావం అన్ని వర్గాల వారికి రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించిందని అన్నారు.


పగిడ్యాల మండలం నెహ్రూనగర్‌లో..


పెద్దదేవళాపురంలో వేడుకల్లో పాల్గొన్న నాయకులు


గడివేముల మండలం దుర్వేసి గ్రామంలో...


కొత్తపల్లిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


మహానందిలో టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న కేసీ కెనాల్ అధ్యక్షుడు రామలింగారెడ్డి


వెలుగోడులో..


పాములపాడులో టీడీపీ జెండా ఎగురవేస్తున్న నాయకులు


మిడుతూరులో జెండాను ఆవిష్కరిస్తున్న మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి


నందికొట్కూరు మండలం అల్లూరులో..

హెల్మెట్ ధరించండి

నంద్యాల క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని పోలీస్ అధికారులు సూచించారు. కర్నూలు రేంజ్ డీఐజీ కోయప్రవీణ్ ఆదేశాలమేరకు,ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సూచనలతో శనివారం నంద్యాల జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని రవీంద్ర పబ్లిక్‌స్కూల్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్లకార్డులతో పోలీస్ అధికారులు విద్యార్థులకు ట్రాఫిక్ సిగ్నల్‌పై అవగాహన కల్పించారు. సిటీబస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని గడివేముల ఆటోస్టాండ్ వద్ద ఆటోడ్రైవర్లకు, ప్రయాణికులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు లక్ష్మయ్య, సలాంఖాన్ పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సభలో 21 తీర్మానాలు

ఆత్మకూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో శనివారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సభలో టేబుల్ అజెండాతో కలిపి మొత్తం 21 తీర్మానాలను సభ్యులు ఆమోదించారు. ఇందులో ప్రధానంగా ఆత్మకూరు పట్టణంలో యూఐటీఎఫ్ కింద రూ.139.95కోట్లతో సమగ్ర తాగునీటి సరఫరా కోసం సంబంధించిన అంచనాలకు ఆమోదం తెలిపారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.9.49కోట్ల వ్యయంతో సుమారు 9 కాంట్రాక్ట్ పనులు చేపట్టేందుకు అంగీకరించారు. అలాగే రూ.1.65లక్షల జనరల్ ఫండ్ నిధులతో వాటర్ ట్యాంకులకు నిచ్చెల ఏర్పాటుకు ఆమోదించారు. చలివేంద్రాలు, చలువ పందిళ్లు, ఇతర సదుపాయాల నిమిత్తం రూ.2.97లక్షలు ఖర్చులను ఆమోదించారు. కొత్తపల్లి రస్తాలో రూ.3.5లక్షలతో దోబీ ఘాట్ల మరమ్మతులు చేయాలని, ఇంజనీరింగ్ విభాగంలోని సివిల్ వర్క్‌లకు సంబంధించిన క్వాలిటీ అస్యూరెన్స్ కన్సల్టెన్సీని నియమించేందుకు తీర్మానం చేశారు. కమిషనర్ వాహన ఖర్చులకు నెలకు రూ.35వేలు సాధారణ నిధుల నుంచి ఇవ్వాలని, పట్టణ పరిధిలోని 279 పన్ను అసెస్మెంట్లను ఆన్‌లైన్ నుంచి తొలగించేందుకు గాను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారికి జాబితా పంపించాలని ఆమోదించారు. మున్సిపాలిటీ లీగల్ అడ్వైజర్‌గా కే.కేశవరెడ్డిని నియమించి నెలకు రూ.15వేల చొప్పున గౌరవ వేతనం అందించేందుకు అంగీకరించారు. మాజీ సైనికోద్యోగికి పుస్తెల ధర్మరాజుకు పన్ను మినహాయింపు ఇవ్వాలని, రూ.99వేల ఖర్చులతో పాతబస్టాండ్ నుంచి తిక్కయ్యస్వామి దర్గా వరకు విద్యుత్ స్తంభాలను మార్చాలని నిర్ణయించారు. రెండు ట్రాక్టర్లు, 2కాంపాక్ట్ వెహికల్స్ టైర్లు మార్చాలని, వేసవి దృష్ట్యా 2018-19 ఏఎస్‌సీజీ కింద రూ.40.5లక్షల నిధులతో పాటు రూ.15లక్షల జనరల్ ఫండ్ నిధులతో తాగునీటి సరఫరా వర్క్‌లు, మోటార్ల మరమ్మతులు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని తీర్మానించారు. 2024-25 బడ్జెట్ అంచనాలకు, జరిగిన వేలం పాటలను ఆమోదం పలికారు. కాగా ఆప్కాస్ ద్వారా ఇద్దరు డ్రైవర్ల నియామకంపై సభ్యులు అభ్యంతరం తెలపడంతో ఆ తీర్మానాన్ని రద్దు చేశారు. టేబుల్ అజెండా కింద రూ.2.78కోట్లతో 14 వర్క్‌లకు సభ్యులు అంగీకరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, కమిషనర్ రమేష్‌బాబు ఉన్నారు.

కోరం లేకుండా చేసేందుకు యత్నాలు :

గడిచిన రెండు కౌన్సిల్ సమావేశాలకు వైసీపీ కౌన్సిలర్లు హాజరు కాకుండా డుమ్మా కొట్టడంతో సమావేశాలు వాయిదా వేశారు. అయితే శనివారం జరిగిన కౌన్సిల్ సభకు కూడా కోరం లేకుండా చేసేందుకు వైసీపీ కౌన్సిలర్లు ప్రయత్నించారు. అయితే అనూహ్యంగా వైసీపీ కౌన్సిలర్లు విజయ్‌చౌదరి, సయ్యద్ గౌసియా, ప్రకాష్‌బాబు, బోయ లక్ష్మమ్మ సభకు రావడంతో కోరం ఎలాంటి ఇబ్బంది జరగలేదు. దీంతో అనుకున్నట్లుగా తీర్మానాలపై చర్చ జరిగి ఆమోదించడం జరిగింది.


తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వైసీపీ కౌన్సిలర్ల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

కమీషన్ల కోసమే కొంతమంది వైసీపీ కౌన్సిలర్లు కౌన్సిల్ సభలకు డుమ్మా కొడుతున్నారని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం ఆత్మకూరులో జరిగిన కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ హయంలో ఆత్మకూరు మున్సిపాలిటీకి నిధుల మంజూరు లేకుండా అధోగతి పట్టించారని అన్నారు. కనీసం మున్సిపల్ కార్యాలయాన్ని కూడా నిర్మించుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. అయితే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8నెలల్లోనే పురపాలక శాఖ మంత్రి నారాయణ చొరవతో స్పెషల్ గ్రాంట్ కింద ఆత్మకూరు మున్సిపాలిటీకి రూ.3కోట్ల నిధులు మంజూరయ్యారని, త్వరలోనే మరో రూ.1.5కోట్ల నిధులు రానున్నట్లు చెప్పారు. అయితే మంజూరైన పనులను చేపట్టేందుకు మున్సిపల్ తీర్మానాలు చేయాల్సి ఉండగా కొంత మంది వైసీపీ కౌన్సిలర్లు కౌన్సిల్ సభలకు హాజరు కాకుండా డుమ్మా కొట్టడం సిగ్గుచేటని విమర్శించారు. అంతకుముందు పట్టణంలోని పలు చోట్ల తాగునీటి పథకాలను ప్రారంభించారు.

'చిరు ఉద్యోగులపై కక్ష సాధింపులు ఆపాలి'

నందికొట్కూరు రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : చిరు ఉద్యోగులపై కక్ష సాధింపుచర్యలు ఆపాలని సీపీఎం, సీఐటీయూ జిలా నాయకులు నాగేశ్వరావు, ఏసురత్నం, పక్కీర్‌సాహెబ్ అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ మంలంలోని మల్యాల గ్రామంలో గ్రామైక్య సంఘాల వీవోఏలను అక్రమంగా తొలగించడం అన్యాయమన్నారు. అనంతరం ఎంపీడీవో సుబ్రమణ్యాశర్మకు సీపీఎం, సీఐటీయూ నాయకులు, బాధితులు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని జీవనజ్యోతి, దివ్య గ్రామైక్య సంఘం వీఓఏలైన శ్రీరాములు గౌడు, షఫీలను అర్ధాంతరంగా తొలగించడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గోపాల క్రిష్ణ, వీఓ ఏల సంఘాల నాయకులు రమణ. సతీష్, జయమ్మ, ఏస్తేరమ్మ, ముర్తుజాబి, సలీమాబీ, శకుంతలమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు

మిడుతూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండలంలో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ వెంకటేశ్వరమ్మ అధికారులకు సూచించారు. శనివారం మిడుతూరు గ్రామంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో దశరథ రామయ్య మాట్లాడుతూ గ్రామాల్లో వేసవిలో పశువులు తాగు నీరు కోసం నీటి తొట్లు ఏర్పాటు చేసేందుకు ఆయా గ్రామాల సర్పంచులు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కార్యదర్శులకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఈవోఆర్‌డీ సంజన్న, వివిధ శాఖల అధికారులు, ఉప మండల అధ్యక్షులు నబీరసూల్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

గోస్పాడు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం మండలంలోని జిల్లెల్ల గ్రామంలో పకృతి వ్యవసాయంతో దేశవాళి వరి పంటల సాగును ఆమె పరిశీలించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతులలో పంటలను సాగు చేసుకోవాలన్నారు. దీని వలన రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహార ధాన్యాలను పొందవచ్చునన్నారు. డ్రోన్ ద్వారా జీవామృతం పిచికారి చేస్తున్న రైతును అభినందించారు. డ్రోన్ల వినియోగం పెంచాలని అన్నారు. మానికుంట ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని సందర్శించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు బాలమద్దిలేటిని అభినందించారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఎడిఎ రామ్మోహన్‌రెడ్డి, డిపిఎం నరేంద్రరెడ్డి, ఎవో స్వప్నిక, ఈవోఈర్డీ నాగఅనసూయ, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ, పాల్గొన్నారు.

పారిశుధ్యలోపంపై ఆగ్రహం: శనివారం జిల్లెల్ల గ్రామానికి వచ్చిన కలెక్టర్ పారిశుద్య లోపంపై కార్యదర్శిని మందలించారు. గ్రామంలో ఉపాధిపనులు చేపట్టాలని ఏపీవో జ్యోతిని ఆదేశించారు.

చట్టాలపై గిరిజనులకు అవగాహన ఉండాలి

ఆత్మకూరు రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై చెంచు గిరిజనులు అవగాహన కలిగి ఉండాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని అమలాపురం గూడెంలో ఈ మేరకు తహసీల్దార్ రత్నరాధిక ఆధ్వర్యంలో స్థానిక గిరిజనులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గిరిజనుల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమం కోసం ప్రభుత్వాలు పలు చట్టాలు అమలు చేస్తున్నాయన్నారు. ఆయా చట్టాలపై చెంచులు అవగాహన కలిగి ఉండి వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పలు సంఘాల నాయకులు, రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

క్రీడల్లోనూ రాణించాలి

డోన్ రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు యువత, విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని వలసల గ్రామంలో ఉగాది పండుగ పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్లు వలసల రామకృష్ణ, మంజునాథ్, మాజీ జడ్పీటీసీ సభ్యులు పద్మావతి, వలసల గ్రామ టీడీపీ నాయకులు వలసల బాలుడు, సుధాకర్ పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన గోగిశెట్టి



మంత్రి నారా లోకేశ్‌తో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు

శిరివెళ్ల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): శిరివెళ్ల మండలం వీరా రెడ్డిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, హైకోర్టు న్యాయవాది గోగిశెట్టి నరసింహారావు తనయుడితో కలిసి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి లోకేశ్‌కు ఆయన విశ్వావసునామ తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

రుద్రవరం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం మండలం పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ.పాములేటి, ఉపాధ్యక్షుడిగా అరవింద నాయక్, కార్యదర్శులుగా షాహినూర్, రామకృష్ణ, ఉప కార్యదర్శి శశికళ, కోశాధికారి పాములేటి, సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో భాగ్యలక్ష్మిని కలిసి వినతిపత్రం అందించారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

రుద్రవరం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా నిర్వహించారు. శనివారం మండలపరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. 14 మంది ఎంపీటీసీలుండగా తొమ్మిదిమంది ఎంపీటీసీలు హాజరయ్యారు. సమస్యలపై ఒక్క ఎంపీటీసీ కూడా నోరు మెదపలేదు. అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు సుబ్రమణ్యం, కమాల్‌సాహెబ్, రఘురాముడు, నాగరాజు, ఎంఈవో వీరరాఘవయ్య, పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్, ఏపీవో ప్రతాప్ పాల్గొన్నారు.



డోన్ ఎంఎస్ఆర్ కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి



అంకిరెడ్డిపల్లెలో వేడుకల్లో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి తదితరులు



ఆళ్లగడ్డలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, నాయకులు



కోవెలకుంట్లలో నివాళి అర్పిస్తున్న గడ్డం రామకృష్ణారెడ్డి తదితరులు



అవుకులో టీడీపీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న ఉగ్రసేనారెడ్డి, నాయకులు



చాగలమర్రి గాంధీ సెంటర్‌లో టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటిన ఎన్టీఆర్

- టీడీపీ నాయకులు
- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

డోన్ రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని చాటి చెప్పిన మహానేత నందమూరి తారక రామారావు అని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కొనియాడారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, పట్టణ మాజీ సర్పంచ్ పెద్ద కేశవయ్యగౌడు, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకు అంకితమైన టీడీపీ

ప్రజాసేవకు అంకితమై టీడీపీ పని చేస్తోందని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం ఎంఎస్ ఆర్ కార్యాలయం ఆవరణంలో పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్యాపిలి మాజీ ఎంపీపీ ఆర్ఈ రాఘవేంద్రగౌడు, గండికోట రామసుబ్బయ్య, న్యాయవాది ఆలా మల్లికార్జున రెడ్డి, గంధం శ్రీనివాసులు, చక్రపాణిగౌడు, సిటీ కేబుల్ కిరణ్ తదితరులున్నారు. అలాగే మండలంలోని వలసల గ్రామంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. మిద్దెపల్లి, ఉడుములపాడులో టీడీపీ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు.

బేతంచెర్ల: పట్టణంలోని పాతబస్టాండులో కోటపేటలో ఎన్టీఆర్ చిత్రపటానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. ముందుగా రెహిమాన్‌పురం గ్రామంలో ఎమ్మెల్యే కోట్ల, టీడీపీ నాయకులను, గ్రామ నాయకుడు వెంకటేశ్వరగౌడు ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించారు. అలాగే బలపాలపల్లెలో టీడీపీ సీనియర్ నాయకుడు పోలూరు శ్రీనివాసరెడ్డి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎల్లనాగయ్య, సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, మండల సమన్వయ చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు తిరుమలేష్ చౌదరి, బుగ్గన బ్రహ్మానందరెడ్డి, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, జావాజీ వెంకటేశ్వర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అలాగే దివంగత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాజా నారాయణమూర్తి, టి శ్రీనివాసులు, ఆర్ఈ నాగరాజు, ఖాజాపీర్, రాజరవి, నాగేంద్ర, చల్లా వీరాంజినేయులు, మధుకుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

శిరివెళ్ల : మండలంలోని అన్ని గ్రామాల్లో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నాయకులు, కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఆళ్లగడ్డ(శిరివెళ్ల) : పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి టీడీపీ జెండా ఎగురవేశారు. అంకిరెడ్డిపల్లెలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, రవిప్రకాశ్‌రెడ్డి, కనకాద్రిపల్లెలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి, వెంకటమల్లారెడ్డి, సర్పంచ్ శివశంకర్, గ్రామాల్లో నాయకులు పార్టీ జెండా ఎగురవేశారు.

కోవెలకుంట్ల : పట్టణంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అమడాల మద్దిలేటి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవుకు : పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద అవుకు మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి, టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణనాయక్ ఆధ్వర్యంలో నందమూరి తారకరామా రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ జెండాను ఆవిష్కరించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే గ్రామాల్లో పార్టీ నాయకులు జెండాలు ఎగురవేశారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం సాయంత్రం టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్ బాషా, మండల కన్వీనర్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. జెండాను ఆవిష్కరించారు. అలాగే ముత్యాలపాడు బస్టాండులోని టీడీపీ కార్యాలయంలో నంద్యాల బీసీసెల్ స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, టీఎన్‌టీ యూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, దూదెకులు, బీసీ సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేశారు.

ఉయ్యాలవాడ: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో టీడీపీ మండల అధ్యక్షుడు బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పార్టీ మండల సీనియర్ నాయకుడు కూడాల నారాయణరెడ్డితో కలిసి పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు ఆకుల చిన్నవెంకటసుబ్బయ్య, నాయకులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని దొర్నిపాడులో టీడీపీ నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు సిద్ధినారాయణ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించి దివంగత నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో చాకరాజువేముల సాగునీటి సంఘం అధ్యక్షుడు వెంకట్‌నాయుడు, దొర్నిపాడు మాజీ సర్పంచ్ సిద్ధి నారాయణ, రమేష్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

రుద్రవరం : రుద్రవరం, చిన్నకంబలూరు గ్రామాల్లో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఏవీ రంగనాయకులు, పెద్దపుల్లారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



బేతంచెర్లలో టీడీపీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



ఉయ్యాలవాడలో..



దొర్నిపాడులో..



రుద్రవరంలో..



శిరివెళ్లలో..

శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం: మంత్రి బీసీ

బనగానపల్లె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 6న శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయం ఆవరణంలో నిర్వహించనున్న సీతారాముల కల్యాణ ఉత్సవాల ఏర్పాట్లను మంత్రి బీసీ స్వయంగా పరిశీలించారు. మంత్రి బీసీ సొంత నిధులతో అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించనున్నారు. అన్నదానం ఏర్పాట్లను చేయనున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

కనీస సౌకర్యాలు లేవు: సీపీఎం

డోన్ రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు కాలనీ ప్రాంతాల్లో ప్రజలు కనీస సౌకర్యాలకు కూడా నోచుకోవడం లేదని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కోయలకొండ నాగరాజు అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ ఏర్పాటై 20 సంవత్సరాలు గడుస్తున్నా.. పట్టణంలోని పలు వార్డులు ఇంత వరకు అభివృద్ధి చెందకపోవడం విచారకరమన్నారు. ఇంటి పన్ను వసూలులో చూపించే శ్రద్ధ వార్డుల అభివృద్ధిలో చూపించడం లేదని విమర్శించారు. వార్డుల్లో మౌలిక వసతులు కల్పించకపోతే పెద్దఎత్తున్న ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు రామాంజనేయులు, భాస్కర్ రెడ్డి, నాగమద్దయ్య తదితరులున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

డోన్ టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా అన్నారు. శనివారం సాయి శ్రీ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌రంగాపురం గ్రామంలో ..

బేతంచెర్ల: మండలంలోని రంగాపురం గ్రామంలోని మద్దిలేటి స్వామి ఆర్చీ వద్ద ఆటో డ్రైవర్లకు, భక్తులకు ట్రాఫిక్ నిబంధనలపై బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు ఉన్నారు.

కోవెలకుంట్ల: మద్యం తాగి వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామని సీఐ హనుమంత నాయక్ తెలిపారు. శనివారం పట్టణంలోని గ్రామ పంచాయతీ సర్కిల్ వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంజామల ఎస్ఐ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

శిరివెళ్ల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండుగలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ వంశీధర్ సూచించారు. శనివారం శిరివెళ్లలోని పోలీస్ స్టేషన్‌లో హిందూ, ముస్లిం మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రజలు సోదరభావంతో మెలుగుతూ మతసామరస్యాన్ని చాటాలన్నారు. ప్రార్థనా మందిరాలు, ఆలయాల వద్ద నియమాలు పాటిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించే వారిని ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు.

'ఉపాధి' నిధులు పక్కదారి

ప్యాపిలి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో రూ.6.5లక్షల నిధులు పక్కదారి పట్టాయని సామాజిక తనిఖీ అధికారులు తేల్చారు. స్వాహా నిధులను వెంటనే చెల్లించాలని ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య అధ్యక్షతన జాతీయ ఉపాధి హామీ పథకం 2023-24లో జరిగిన పనులకు సంబంధించి బహిరంగ విచారణ సమావేశాన్ని నిర్వహించారు. రూ. 25కోట్ల పనులు జరుగగా అందులో రూ.6.5 నిధులు స్వాహా అయినట్లు సామాజిక అధికారుల వెల్లడించారు. మండలంలోని బూరుగుల, కలచట్ల, భోంచె ర్వుపల్లి, జలదుర్గం తదితర గ్రామాల్లో ఉపాధిలో అక్రమాలు జరిగినట్లు తెలిపారు. పాతపనులకు బిల్లులు చేయడం, బోగస్‌పేర్లతో, చనిపోయిన మొక్కలకు బిల్లులు చెల్లించి నిధులను పక్కదారి పట్టించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం పీడీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అవినీతికి పాల్పడిన సొమ్మును వెంటనే జమ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీడీలు అన్వర్‌బేగం, నరసింహారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ వెంకటసుబ్బయ్య

పద్య రచన పోటీల్లో డోన్ వాసి ప్రతిభ

డోన్ టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పద్యరచన పోటీల్లో డోన్‌వాసి ప్రతిభ చూపారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని తణుకు శ్రీనన్నయభట్టారక పీఠం ఆధ్వర్యంలో అభ్యుదయంలో ఆంధ్రప్రదేశ్ అన్న అంశంపై రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. డోన్ నెహ్రూనగర్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ తోగాట సుభాష్‌బాబు రచించిన పద్య కవితకు ద్వితీయ బహుమతి వచ్చిందని ఆ సంస్థ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జొన్నలగడ్డ సూర్య సుబ్రహ్మణ్యం, కొల్లా రామచంద్రశర్మ శనివారం తెలిపారు. ఉగాది రోజు తణుకులోని రామకృష్ణ సేవా సమితిలో జరగబోయే అభినందన సభలో బహుమతి ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

సెలవు దినాల్లోనూ బిల్లులు చెల్లించవచ్చు

డోన్ టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ సెలవు దినాల్లోనూ విద్యుత్ కార్యాలయంలో కరెంటు బిల్లులు చెల్లించవచ్చని ట్రాన్స్ కో ఈఈ కమలాకర్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన అధ్యక్షుడు శివరామిరెడ్డి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 29(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన శివరామిరెడ్డి, ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భార్గవ్‌రామ్ దంపతులను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే దంపతులను వారు సత్కరించారు. కార్యక్రమంలో ఏజీపీ బాలగురెడ్డి, న్యాయవాదులు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కోడిగుడ్లు సరఫరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రుద్రవరం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం మండలం శ్రీరంగాపురం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో గుడ్డు ఏది.. అనే శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో కథనం శనివారం ప్రచురితమైంది. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. పాఠశాల విద్యార్థులకు కోడిగుడ్లు సరఫరా చేసినట్లు హెచ్‌ఎం స్వర్ణలత తెలిపారు. కోడిగుడ్ల సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎంఈవో వీర రాఘవయ్య అన్నారు.